క్లుప్తంగా

నరేశ్‌కు డాక్టరేట్



కేసముద్రం : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కత్తుల నరేశ్‌కు సీఎస్ఐఆర్–ఐఐసిటి, హైదరాబాద్ ద్వారా డాక్టరేట్ పొందినట్లు గురువారం ప్రకటనలో తెలిపారు. నరేశ్‌ను స్థానికులు అభినందించారు.

తెగిన విద్యుత్ తీగలు పునరుద్ధరించిన అధికారులు



డోర్నకల్ : డోర్నకల్ మున్సిపల్ పరిధిలో బుధవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు రాత్రంతా జాగరణ చేశారు. భారీ వర్షంతో చర్చి కాంపౌండ్ ప్రాంతంలో నాలుగు చోట్ల 11కేవీ వైరు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 10:30 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 3:20 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కురవి ఏడీఈ ఘటన స్థలానికి చేరుకుని స్థానిక సిబ్బంది సహకారంతో మరమ్మతు పనులు పూర్తి చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అమరవీరుల స్మారక ర్యాలీ



కొత్తగూడ : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల స్మారక ర్యాలీని మండల కేంద్రంలో గురువారం అటవీ శాఖ ఉద్యోగులు నిర్వహించారు. అడవులు రక్షించడమే ధ్యేయంగా పనిచేస్తూ అటవీ జంతువులు, స్మగ్లర్ల దాడి, ఇతరుల దాడిలో ఎందరో ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని ఎఫ్ఆర్ఓ వజ్రహత్ అన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

గూడూరు : అటవీ సంరక్షణలో భాగంగా అమరులైన వారి త్యాగాలు మరువలేనివని ఎఫ్‌డీఓ వి.చంద్రశేఖర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఫారెస్టు కార్యాలయంలో గురువారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎఫ్ఆర్వో బి.సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులైన అటవీ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్‌కు చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్ పేరుతో ఫేక్ వాట్సాప్

● గుర్తుతెలియని వ్యక్తులపై కేసు

మహబూబాబాద్ రూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు కలెక్టర్ పేరుతో నకిలీ వాట్సాప్ ఐడీ క్రియేట్ చేశారు. దీంతో కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి కేవీ.పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 10వ తేదీన +84926 334919 నంబరుతో గుర్తుతెలియని వ్యక్తులు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పేరుతో నకిలీ వాట్సాప్ ఐడీని సృష్టించి ఐడీఓసీలోని సిబ్బందికి మెసేజ్‌లు పంపించారు. కలెక్టర్ పేరుతో నకిలీ ఐడీ క్రియేట్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పవన్ కుమార్ ఫిర్యాదు చేశారన్నారు.అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.

విషగుళికలు మింగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● ఆస్పత్రిలో చేర్పించిన ఎస్సై సతీశ్

కురవి : భార్యతో గొడవపడిన వ్యక్తి విషగుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాగా కురవి ఎస్సై గండ్రాతి సతీశ్ తన వాహనంలో మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు సమీపంలో గల చింతలపూడికి చెందిన శ్రీరాముల కృపానందం కురవి పరిసర ప్రాంతంలో ఉంటున్నాడు. బైక్‌పై ఇళ్లల్లో ఉపయోగించుకునే స్టీల్ సామగ్రి అమ్ముకుంటున్నాడు. గురువారం ఉదయం కురవి పశువుల సంతలో విషగుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా అక్కడే ఉన్న కొందరు గమనించి డబ్బాను పక్కకు పడేశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీస్ వాహనంలో మహబూబాబాద్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి



దంతాలపల్లి : మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన రైతు హనుమాండ్ల భిక్షం రెడ్డి తన పశువులను పొలంలో మేపుతున్నాడు. ఈక్రమంలో గురువారం పాడిగేదెపై పిడుగు పడటంతో మృతిచెందింది.గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

బడి ఇలా.. బోధన ఎలా?

డైనింగ్ హాల్.. వరండాలోనే విద్యార్థులకు పాఠాలు

- శిథిలావస్థలో పెనుగొండ జెడ్పీ హైస్కూల్
- పెచ్చులూడడంతో గదులకు తాళాలు
- వర్షం పడినప్పుడల్లా ఇబ్బందులే..



వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు



డైనింగ్‌హాల్‌లో పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు



హైస్కూల్ తరగతి గదిలో పెచ్చులూడిన స్లాబ్

కేసముద్రం : తరగతి గదుల్లో స్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. దీంతో ఆయా గదులకు ఉపాధ్యాయులు తాళాలు వేశారు. విద్యార్థులకు సరిపడా గదులు లేక డైనింగ్ హాల్, వరండాలోనే చదువు కొనసాగుతోంది. మండలంలోని పెనుగొండ జెడ్పీ హైస్కూల్ 6నుంచి 10వ తరగతి వరకు మొత్తం 132 మంది విద్యార్థులు, 13 మంది టీచర్లు ఉన్నారు. పాఠశాలలో మొత్తం 8గదులు ఉండగా, కొన్నేళ్లుగా స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పెద్ద పెళ్లలు పడుతుండటంతో చేసేది ఏమిలేక కొన్ని తరగతి గదులకు తాళాలు వేశారు. ప్రస్తుతం ఆరు గదులు అవసరం ఉండగా, మూడు మాత్రమే అనుకూలంగా ఉన్నాయి. మిగిలిన తరగతులకు చెందిన విద్యార్థులు డైనింగ్ హాల్, వరండాలో కూర్చుంటున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి వర్షపు జల్లులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికైనా నూతన భవనాన్ని నిర్మించాలని ఉపాధ్యాయుల, విద్యార్థులు కోరుతున్నారు.

చెట్ల కిందనే కూర్చుంటున్నాం..



క్లాస్‌రూంలో స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. అందుకే ఆ గదులకు తాళాలు వేశారు. తమకు గదులు సరిపోకపోవడంతో చెట్ల కిందనే కూర్చుంటున్నాం. వర్షం వచ్చినప్పుడల్లా వరండాలో కూర్చుకోవాల్సి వస్తుంది. వర్షం పడ్డ ప్రతిసారి జల్లు పడుతుండటంతో,చదువలేకపోతున్నాం. ఇప్పటికైనా తరగతి గదులు నిర్మించాలి.

– సాయిప్రణీత, 8వ తరగతి

సిమెంట్ పెచ్చు పడింది



గతేడాది క్లాస్ రూంలో చదువుతుండగా ఒక్కసారిగా స్లాబ్ నుంచి సిమెంట్ పెచ్చు నా పక్కన పడింది. దీంతో భయంతో పరుగులు తీశా. భయంభయంగా చదువుతున్నాం. విపరీతంగా పెచ్చులు పడుతుండటంతో మేము వరండాలోనే కూర్చుంటున్నాం.మరికొందరు డైనింగ్ హాల్‌లో కూర్చుంటున్నారు. తమకు నూతన భవనం నిర్మిస్తే బాగుంటుంది.

– మునీశ్వర్, 8వ తరగతి

రైతులకు యూరియా పంపిణీ



చిన్నగూడూరు: ఉగ్గంపల్లి రైతు వేదిక వద్ద రైతులను అదుపు చేస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్



కురవి: యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు



నెల్లికుదురు: పంపిణీని పరిశీలిస్తున్న ఎస్పీ

మరిపెడ/మరిపెడ రూరల్ : మరిపెడ సహకార పరపతి సంఘం ద్వారా మండలంలోని ప్రతీ రైతుకు యూరియాను పంపిణీ చేస్తున్నట్లు మరిపెడ ప్రాథమిక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి, ఏడీఏ విజయ్ చందర్ తెలిపారు. గురువారం మరిపెడ పీఏసీఎస్ ద్వారా అబ్బాయిపాలెం, ఉల్లెపల్లి, ఎల్లంపేట, తాళ్లఊకల్, వెంకంపాడు గ్రామాల రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, తహసీల్దార్ కృష్ణవేణి, మండల వ్యవసాయ అధికారి బోడ వీరసింగ్, స్థానిక నాయకులు తాజుద్దీన్, లక్ష్మీనారాయణ, అప్సర్, సాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

1,666 బస్తాల యూరియా పంపిణీ

నెల్లికుదురు : మండలంలోని మూడు సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్లలో 1,666 బస్తాల యూరియాను గురువారం రైతులకు పంపిణీ చేసినట్లు మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న, తహసీల్దార్ చందా నరేష్ తెలిపారు. మండలంలోని శ్రీరామగిరి, నెల్లికుదురు సొసైటీల ఆధ్వర్యంలో యూరియా పంపిణీని ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ సందర్శించి పరిశీలించారు. ఎస్సై రమేష్ బాబు, ఏఓ, ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు పహారా మధ్య కూపన్ల పంపిణీ

చిన్నగూడూరు : మండలంలోని రైతువేదికల వద్ద పోలీసు పహారా మధ్య యూరియా కూపన్లు పంపిణీ చేశారు. గురువారం ఉగ్గంపల్లి రైతు వేదిక వద్ద యూరియా కూపన్ల కోసం వందల మంది రైతులు రావడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను క్యూలైన్‌లో నిలబెట్టారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు యూరియా కూపన్లను పంపిణీ చేశారు.

కురవిలో..

కురవి : సీరోలు, కురవి మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కురవి సొసైటీ, నేరడ, బలపాల, గుండ్రాతిమడుగు(విలేజి), కాంపల్లి సొసైటీల్లో యూరియా పంపిణీ చేపట్టారు. కాగా యూరియా కూపన్ల కోసం రెండు రోజుల క్రితం గాయపడిన రైతు బానోత్ రమేష్ కురవి రైతు వేదిక వద్దకు వచ్చి క్యూలో నిలబడ్డాడు. యూరియా పంపిణీ అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి యూరియా కూపన్లు ఇచ్చారు.

సాయుధ పోరుతోనే విముక్తి



డోర్నకల్: మాట్లాడుతున్న విజయసారథి



నెహ్రూసెంటర్: రావి నారాయణరెడ్డి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

● సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

డోర్నకల్ : తెలంగాణ సాయుధ పోరాటంతోనే వెట్టిచాకిరి నుంచి విముక్తి లభించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పెరుమాళ్లసంకీసలో గురువారం అమరవీరుల స్తూపం వద్ద జెండాను ఆవిష్కరించి అమరులైన 22 మందికి నివాళులర్పించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, నెల్లూరి నాగేశ్వర్‌రావు, తురక రమేష్, కరుణం రాజన్న, కె.ప్రభేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట చరిత్రను వక్రీకరించేందుకు కుట్ర

నెహ్రూసెంటర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించేందుకు కొన్ని పార్టీల నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి అన్నారు. రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా గురువారం మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి స్తూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో కమ్యూనిస్టుల పోరాటం, బలిదానాలతోనే విముక్తి జరిగిందని తెలిపారు. ఎంతో మంది ప్రాణత్యాగం చేసిన చరిత్ర సీపీఐదన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మామిండ్ల సాంబలక్ష్మీ, మాజీ కౌన్సిలర్ ఎండీ ఫాతిమా, నాంచారి దాసు, ఎండీ షంషీర్, అల్లి వేణు, మైస శ్రీనివాస్, సాయి, వెంకటమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి లక్షగరికలతో పూజలు



లక్ష్మీగణపతి యజ్ఞం నిర్వహిస్తున్న నిర్వాహకులు

మహబూబాబాద్ రూరల్ : లోక కల్యాణం కోసం పట్టణానికి చెందిన శ్రీ మహాలక్ష్మి గణపతి సేవా ట్రస్టు సభ్యులు లక్ష్మీగణపతికి లక్ష గరికలతో అర్చన పూజను గురువారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈ పూజలు చేశారు. మొదటగా గణపతికి 11సార్లు అధర్వ్‌శీర్ష ఉపనిషత్తుతో అభిషేకం, ఆవుపాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, 11 రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహాగణపతి పూజలో గరికలు సమర్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ సతీమణి డాక్టర్ ఉమా హాజరై లక్ష్మీగణపతి స్వామివారి హోమంలో ఆహుతులు సమర్పించారు. జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాలకు చెందని భక్తులు గణపతికి లక్ష గరిక అర్చన పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు శ్రీరంగం రాధిక, ఎస్‌పీ నాగేశ్వర్‌రావు, సోమ రజిత, శ్రీనివాస్, శ్రీరంగం రాజేశ్వరి, రామారావు, సోమ సింధు, రాంబాబు, సూర్యాపేట వాస్తవ్యులు దేవరశెట్టి ప్రభాకర్‌రావు, సుగుణ పాల్గొన్నారు.

వర్షంతో కూలిన ఇంటిగోడ



బయ్యారం: మండలంలోని చోక్లాతండాలో బుధవారం రాత్రి ఇల్లు కూలిన ఘటనలో తృటిలో ప్రమాదం తప్పింది. తండాకు చెందిన జాటోత్ శాంతి రేకుల ఇల్లు రాత్రి గాలితో కురిసిన వర్షానికి గోడకూలింది. ఈ సమయంలో ఇంట్లో ఉన్న శాంతి తృటిలో ప్రాణాలతో బయటపడింది.

మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించాలి

మహబూబాబాద్ అర్బన్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17వ తేదీనుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ, పేదలకు సాయం అందించి వేడుకలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఒద్దిరాజు రామచంద్రరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ప్రధాన కార్యదర్శి సేవా పక్వాడ జిల్లా కన్వీనర్ గడ్డం అశోక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

ఘనంగా బాల మైసమ్మ పండుగ

తొర్రూరు రూరల్ : మండలంలోని పత్తేపురం గ్రామంలో గురువారం బాల మైసమ్మ పండుగను రైతులు కనుల పండువగా జరుపుకున్నారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, రైతులు, ట్రాక్టర్ కంపెనీల ప్రతినిధులంతా కలసి బాల మైసమ్మ తల్లి వద్ద పసుపు, కుంకుమలతోపాటు నూతన దుస్తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు

తొర్రూరు : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సమితి మాజీ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో గురువారం సీపీఐ మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ నెల 16న తొర్రూరులో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

మహబూబాబాద్ రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌తో పాటు సురేష్ నాయక్ గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

తొర్రూరు : రాష్ట్ర ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలని ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మేరుగు కరుణాకర్ కోరారు. ఈ నెల 19 నుంచి హైదరాబాద్‌లో జరిగే ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను గురువారం డివిజన్ కేంద్రంలో ఫొటోగ్రాఫర్ల సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు.

కుర్చీలు, విద్యాసామగ్రి అందజేత



గార్ల : మండలంలోని ముత్తితండా అంగన్‌వాడీ కేంద్రానికి పుల్లూరు గ్రామానికి చెందిన ఎస్.సంపత్ పిల్లలకు అవసరమైన కుర్చీలు, విద్యాసామగ్రిని గురువారం అందజేశారు. ముత్తితండాకు చెందిన ఆర్.వీరన్నకు దాత సంపత్ చిన్ననాటి స్నేహితుడు కావడంతో తమ తండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి సాయం చేయాలని కోరాడు.

విద్యుత్ ప్రమాదాలతో జాగ్రత్త..



పొలంబాట నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు

గూడూరు : విద్యుత్ ప్రమాదాలతో ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కవిత సూచించారు. మండల కేంద్రంలోని అయోధ్యపురంలో గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'పొలంబాట' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బావుల వద్ద ఏర్పాటు చేసే స్టార్టర్లకు, మోటార్లకు ఎర్తింగ్ ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యుత్ తీగలు, ఐరన్ వైర్‌లపై దుస్తులు ఆరబెట్టరాదని తెలిపారు. రైతుల విద్యుత్ సమస్యలను తెలుసుకొని, పరిష్కార మార్గం చూడమని ఏఈకి సూచించారు. విద్యుత్ ప్రమాదాల సమయంలో 1912 టోల్ ఫ్రీ నంబర్ ఉపయోగించుకోవాలన్నారు. ఏఈ మెట్టురాం, లైన్‌ఇన్‌స్పెక్టర్ రాంనర్సయ్య, ఏఎల్‌ఎం రాకేష్, రాంచందర్, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్



ఎల్ఓసీ అందజేస్తున్న రామచంద్రునాయక్

మరిపెడ రూరల్ : డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ పేర్కొన్నారు. మండలంలోని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన ధరావత్ భద్రుకు రూ.2.50 లక్షలు, రాంపురం గ్రామానికి చెందిన పులుగుజ్జు శ్రీవాస్తవ్‌కు రూ.6 లక్షల విలువైన సీఎం సహాయనిధి ఎల్ఓసీలను హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బాధితులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రునాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, నూకల అభినవ్‌రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, అంబరీష, పెండ్లి శ్రీనివాసరెడ్డి, పానుగోలు రాంలాల్, మెంచ్ అశోక్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వానం

పురుషోత్తమాయగూడెం గ్రామంలో దివంగత నాయకుడు నూకల నరేష్ రెడ్డి విగ్రహాన్ని ఈ నెల 23న మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్‌కు నరేష్‌రెడ్డి తనయుడు అభినవ్‌రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశాడు.

విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

● డీఈఓ దక్షిణమూర్తి



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు సునీతను సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.దక్షిణమూర్తి ఉపాధ్యాయులను సూచించారు. డీఈఓ కార్యాలయంలో గురువారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు రాధారపు సునీతను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో జీసీడీఓ విజయకుమారి, సైన్స్ అధికారి అప్పారావు, క్వాలిటీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌ఆజాద్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో ఇంగ్లిష్, హిందీ ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కురవి : సీరోలు, కురవి మండలాల్లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికకాగా వీరిని గురువారం కురవి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా సన్మానించారు. కురవి, సీరోలు ఎంఈఓలు బాలాజీ, లచ్చిరాం నాయక్ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఫైనాన్స్ ఆడిట్ ఆఫీసర్ బానోత్ శంకర్‌నాయక్, హెచ్‌ఎంలు అరుణశ్రీ, బంగారి, వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

బయ్యారం : బయ్యారంలోని పీజీరోడ్డు ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తూ పదోన్నతిపై బయ్యారం బాలుర ఉన్నత పాఠశాలకు ఎస్ఏగా వెళ్లిన రచ్చ వెంకటేశ్వర్లు దంపతులను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈఓ దేవేంద్రాచారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లింగరాజు, ఉపాధ్యాయులు పూల్‌సింగ్, రమేష్, రవీందర్, భద్రు, లక్ష్మయ్య, శ్రీను, కుమారి, తారాబాయి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పాఠశాలకు సైన్స్ పరికరాలు బహూకరణ



తొర్రూరు రూరల్ : మండలంలోని మాటేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ ఆలకుంట్ల సుధాకర్ సొంత ఖర్చులతో గురువారం సైన్స్ పరికరాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.

అలుగు పోస్తున్న పెద్దచెరువు

గార్ల : బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గార్ల పెద్దచెరువు అలుగు (మత్తడి) పోస్తుంది. గార్ల, సీతంపేట గ్రామాల ప్రజలు చెరువు వద్దకు వెళ్లి వీక్షించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.భారీ వర్షం, గాలులకు గోపాలపురం గ్రామ సమీపంలో చెట్టు కూలి రహదారికి అడ్డంగా పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది చెట్టును తొలగించడంతో రహదారి క్లియర్ అయ్యింది.

ఔషధ మొక్కల పంపిణీ



గూడూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు గురువారం హైదరాబాద్‌కు చెందిన కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ ఫౌండర్ లీలా లక్ష్మారెడ్డి 18రకాల ఔషధ మొక్కలతో పాటు మట్టిని అందించారు. ఎంఈఓ జె.రవికుమార్, హెచ్ఎం ఎ.సుజాత మొదటి మొక్కను నాటారు. ప్రహరీ, గేట్ ఉండడం వల్ల ప్రతీ రోజు ఔషధ మొక్కలను కాపాడాల్సిన చర్యలు చేపట్టాలని, అందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

తొర్రూరు : ఎలక్ట్రీషియన్ యూనియన్ మండల నూతన కమిటీని గురువారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిమ్మల యాకన్నగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా గట్టు కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా పాదూరి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కనుకుంట్ల నరసింహ, కోశాధికారిగా వల్లపు శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

పాఠశాలకు పునాది పీఈటీలు

కురవి : పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయులు పునాదివంటి వారని సీరోలు ఎంఈఓ ఇస్లావత్ లచ్చిరాంనాయక్, కురవి ఎంఈఓ వి.బాలాజీనాయక్ పేర్కొన్నారు. గురువారం సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో 11 మండలాల వ్యాయామ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆంగోత్ లక్ష్మా నాయక్, హెచ్ఎం అరుణశ్రీ, ఆర్‌పీలు చాంప్లా నాయక్, ఇమామ్ పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

బయ్యారం : కేసముద్రంలో ఈనెల 13,14 తేదీల్లో నిర్వహించనున్న ఇఫ్టూ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఏపూరి వీరభద్రం పిలుపునిచ్చారు. గురువారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు మురళి, నాగేశ్వరరావు, శేషు, యాకూబ్‌పాషా, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


చర్య తీసుకోవాలి

పెద్దవంగర : పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాన్ని అక్రమించుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన డబుల్‌బెడ్రూం కాలనీవాసులు గురువారం తహసీల్దార్ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిలుక వెంకన్న, చెరకు సాలయ్య, జలగం నాగరాజు, చెరుకు వెంకన్న, రాంపాక ముత్తయ్య, చిలుక మధురమ్మ, జ్యోతి, శ్రీలత, యాకమ్మ, వినోద, ప్రమీల, తదితరులు ఉన్నారు.

నిషేధిత గుట్కా వ్యాపారాన్ని నియంత్రించాలి

మరిపెడ రూరల్ : మండలంలో కొనసాగుతున్న నల్లబెల్లం, గంజాయి, గుట్కా ప్యాకెట్ల వ్యాపారాలపై ఉక్కుపాదం మోపాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ కోరారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో సెకండ్ ఎస్సై కోటేశ్వర్‌రావుకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



మరిపెడ రూరల్ : నిబంధనలు పాటించకుండా, ఇష్టానుసారంగా డబుల్ సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్‌పై మరిపెడ పంచాయతీ రాజ్ డీఈ నర్సింహా నాయక్ గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరారం గ్రామానికి మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ఇటీవల చేపట్టగా నాణ్యతా ప్రమాణాలతో పాటు నిబంధనలు పాటించడం లేదన్నారు. తక్షణమే పలు చోట్ల సీసీని పునరుద్ధరించాలని సూచించారు.

ఎల్ఐసీకి ఏజెంట్లు పట్టుగొమ్మలు

నెహ్రూసెంటర్ : ఎల్ఐసీకి ఏజెంట్ల వ్యవస్థే పట్టుగొమ్మలని ఎల్ఐసీ ఏఓఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు కుమార్ అన్నారు. మహబూబాబాద్ డివిజన్ బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక పద్మశాలి భవన్‌లో గురువారం నిర్వహించారు. మహబూబాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడిగా మీగడ లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా బానోత్ సేవియా, కోశాధికారిగా తీగల రాజేందర్ ఎన్నికయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్ :
9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఖ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646